క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. పరిమల కాలనీ, సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, మైత్రినగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధి భీమారంలోని అంబ కాంప్లెక్స్, దుర్గానగర్, సంతోషిమాత దేవాలయం, సత్యసాయికాలనీ, బ్యాంక్‌కాలనీ, కాకతీయ నగర్‌లలో శనివారం మధ్యాహ్నం 3.30గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏప్రిల్ 7న సమావేశం



నయీంనగర్: ఏప్రిల్ 7వ తేదీన సాయంత్రం నుంచి వరంగల్ పార్లమెంట్ పూర్వ ప్రముఖుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఆనంద్ కుమార్ తెలిపారు. ఈమేరకు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



కేయూ క్యాంపస్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ సూచించారు. ఎస్ఎఫ్ఐ రూపొందించిన నూతన సంవత్సరం -2024 డైరీని కేయూలో శుక్రవారం వీసీ ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థితిలోకి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, కేయూ ఉపాధ్యక్షురాలు పరిమళ, సహాయ కార్యదర్శి జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మడికొండ: వాల్మీకి మహర్షి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ కాజీపేట మండల అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని చెప్పారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో వాల్మీకి మహర్షి యూత్ సభ్యులు బోగి సురేష్, శ్రీకాంత్, మధు, నాయకులు గ్రామ అధ్యక్షుడు దువ్వ విజయ్, నీలం వేణుయాదవ్, చంటి, వినయ్, సామెల్, విష్ణు, గౌతమ్, కిరణ్, వినీత్, లడ్డు క్రాంతి, సాంబరాజు పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ కార్యవర్గం ఎన్నిక

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ లోకోషెడ్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, డివిజన్ సెక్రటరీ పి.రవీందర్, కాజీపేట కోఆర్డినేటర్ నాయిని సదానందం ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో సుమారు 150 మంది యూనియన్ సభ్యులు కలిసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఎస్‌కే.జానీమియా, సెక్రటరీగా పి.వేదప్రకాష్, ట్రెజరర్‌గా గిరిమిట్ల రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్లుగా జి.నాగరాజు, ఎస్.తిరుపతి, కె.భాస్కర్ రెడ్డి, వి.యాదగిరి, అసిస్టెంట్ సెక్రటరీలుగా ఎ.యాదగిరి, ఎ.సత్యనారాయణ, ఆర్.నరేష్‌యాదవ్ ఎన్నికయ్యారు.

అప్రమత్తంగా ఉండాలి

కమలాపూర్ : వేసవి దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున 108, 102 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని 108, 102 అంబులెన్సుల ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ సూచించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని 108, 102 అంబులెన్సులను శుక్రవారం తనిఖీ చేశారు. పరికరాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 108 పైలట్ కేదారి, ఈఎంటీ ఉపేందర్, 102 కెప్టెన్ తిరుపతి పాల్గొన్నారు.



నిట్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అతిథులు



డీసీసీ భవన్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బల్దియాలో నివాళులర్పిస్తున్న అధికారులు

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నగర వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన గొప్ప సంఘ సంస్కర్త, రాజకీయవేత్త, స్వాతంత్య్ర సమరయోధుడని పలువురు కొనియాడారు.

- సాక్షి నెట్‌వర్క్



బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న పార్టీ నాయకులు



మామునూరు టీఎస్ఎస్పీ బెటాలియన్‌లో..



వరంగల్ పోచమ్మ మైదాన్‌లో..



కాజీపేట బాపూజీనగర్‌లో..



కాజీపేట చౌరస్తాలో..



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న నాయకులు



పీఆర్టీయూ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో..



కేయూలో పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్, తదితరులు



నివాళులర్పిస్తున్న గ్రాడ్యుయేట్ ఫోరం బాధ్యుడు డాక్టర్ చిర్ర రాజు, తదితరులు



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

విద్యతోనే సమాజ పురోగతి

విద్యారణ్యపురి: విద్య ద్వారానే సమాజ పురోగతి సాధ్యమవుతుందని, సమాజంలోని అసమానతలను తొలగించేది విద్య మాత్రమేనని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రొఫెసర్ బన్న అయిలయ్య తెలిపారు. విద్యా ఫౌండేషన్ పదవ వార్షికోత్సవం, ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా బడుగు, బలహీన వర్గాల చదువు కోసం విద్యా ఫౌండేషన్ కృషి చేస్తోందని కొనియాడారు. జిల్లా మహిళా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధికారి మధురిమ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం, గత సంవత్సరంలో పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన 20మంది దివ్యాంగ, అనాథ విద్యార్థులకు విద్యా ఫౌండేషన్ ప్రతిభా పురరస్కారాలను అందజేసింది.



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు, రచయిత్రి గురుజాడ శోభ, విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిల్ల మహేందర్, గౌరవ సలహాదారులు పొట్లపెల్లి శ్రీనివాస్‌రావు, గురిజాల తిరుపతిరెడ్డి, కార్యదర్శి కలకోట్ల నరేందర్, డాక్టర్ అనితారెడ్డి, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకురాలు నున్న నర్సమ్మ, లీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కాసుల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి వంగపల్లి శ్రీనివాస్‌కు టికెట్ ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా వంగపల్లి శ్రీనివాస్‌కు అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ - టీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్న కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఎమ్మార్పీఎస్ - టీఎస్ నాయకులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో శ్రీనివాస్ చురుకుగా పాల్గొన్నారని, బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి ఆయన తనవంతు కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ - టీఎస్ నాయకులు సిలువేరు సుధాకర్, బొచ్చు మొగిలి, తాళ్లపల్లి విజయకుమార్, జన్ను సంజీవ్, మంద రాజశేఖర్, గిన్నారపు అనిల్ కుమార్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం

కాజీపేట రూరల్: సర్వమానవాళి సృష్టికర్త ఏసుక్రీస్తు బోధనలు, ఆయన చూపిన మార్గం అనుసరణీయమని కరుణాపురం క్రీస్తు జ్యోతిప్రార్థన మందిరం వ్యవస్థాపక డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాష్ అన్నారు. కాజీపేట బాపూజీనగర్ మెయిన్‌రోడ్‌లోని గెత్సెమనే ప్రార్థన మందిరం 8వ వార్షికోత్సవం, కరుణాపురం క్రీస్తు జ్యోతిప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్ జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం జయప్రకాష్, పాస్టర్ జె.థామస్, స్థానిక గెత్సెమనే చర్చి పాస్టర్ ఆర్.రవిపాల్‌ను చర్చి సంఘ పెద్దలు, క్రిస్టియన్లు, మహిళలు సన్మానించారు.

కాజీపేట జంక్షన్‌లో అన్నదానం

కాజీపేట రూరల్: కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కాజీపేట జంక్షన్‌లో శుక్రవారం రాత్రి అన్నదానం చేశారు. ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. సంగాల సునీల్, బేతి సాయికృష్ణ, ఆర్.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జయప్రకాష్

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం



తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

రామన్నపేట: వరంగల్ నగరంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవ వేడుకలు నాలుగు రోజులుగా సాగుతున్నాయి. శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు కనులపండువగా నిర్వహించారు. కల్యాణ తంతును వివరిస్తూ వేద మంత్రోచ్చరణల మధ్య వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఇరుకుళ్ల రమేష్, తోట నవీన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



కావ్యను కలిసిన కార్పొరేటర్లు

హసన్‌పర్తి: వరంగల్ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. కావ్యను వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవాల రాధికారెడ్డి, సిరంగి సునీల్‌కుమార్, జక్కుల రజిత, జన్ను షీబారాణి, అనిల్, అరుణవిక్టర్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'మజ్జిగ పంపిణీ' ప్రారంభం



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

వరంగల్ అర్బన్: అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆర్యవైశ్య మిత్ర బృందం అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు బీట్‌బజార్‌లో కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. వేసవికాలం మొత్తం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్ర బృందం ప్రతినిధులు మోహన్‌రావు, మురళీధర్, కిషన్, సదాశివుడు, రఘుబాబు, ధనలక్ష్మి, సంపూర్ణ, జ్యోతి, పూర్ణ, వాసవి, రాజమణి పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు నిలబెట్టవచ్చు

ఖిలా వరంగల్: వయస్సుతో సంబంధం లేకుండా వచ్చే గుండెపోటు అనేది సాధారణమైందని, గుండెపోటు వస్తే వెంటనే సీపీఆర్ చేసి ప్రాణాలను నిలబెట్టవచ్చని మెడికేర్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వెంకటేష్, కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో బేగంపేట మెడికేర్ వైద్య బృందం ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న 453 మంది టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లకు సీపీఆర్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనిట్ ఆస్పత్రి డాక్టర్ అన్వేషణి, మెడికేర్ వైద్యులు డాక్టర్ వినోద్‌కుమార్, రూబెన్, సతీష్‌కుమార్, ఫార్మసిస్ట్ జలగం రమేష్, వైద్య సిబ్బంది, శిక్షణ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్యులు

బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుంది



రైతు దీక్షలో మాట్లాడుతున్న రావు పద్మ

హన్మకొండ: ఎన్నికల హామీలను అమలు చేయకపోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ రైతుల పక్షాన హనుమకొండలోని బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరికి బోనస్ ఇస్తామని మాట తప్పారని, పంట నష్టానికి పరిహారం ఇవ్వడం లేదని, రైతులకు ఇస్తామన్న బీమా ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన తక్షణమే రుణమాఫీ చేస్తామని చెప్పి ఎందుకు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయ రామారావు, వరంగల్ పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, నాయకులు గురుమూర్తి శివకుమార్, గుజ్జ సత్యనారాయణ రావు, డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనీయులపై దాడులు ఆపాలి

న్యూశాయంపేట: పాలస్తీనీయులపై క్రూర, అమానవీయ దాడులను ఇజ్రాయిల్ ఆపాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) వరంగల్ అధ్యక్షుడు ఫహీమొద్దీన్ సూచించారు. పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను ఖండిస్తూ వరంగల్ చింతల్, నగరంలోని పలుప్రాంతాల్లో శుక్రవారం నమాజు అనంతరం ఎస్ఐఓ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ తయారు చేస్తున్న వస్తువులను ప్రతిఒక్కరూ బహిష్కరించాలని ఎస్ఐఓ ప్రతినిధులు కోరారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు పాలస్తీనీయులకు మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హంజా అబ్దుల్లా, ముబీన్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.



చింతల్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఐఓ సభ్యులు

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న రమాదేవి

హన్మకొండ/హన్మకొండ కల్చరల్: ఫాసిజాన్ని వ్యతిరేకించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, అందుకు ఐకమత్యంగా ఉద్యమించాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు బి.రమాదేవి పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ ప్రజాఫ్రంట్ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ ఆఫీస్‌లో కామ్రేడ్ భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రమాదేవి, జనగాం కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల సభ్యులు పాల్గొని మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని ఆదివాసులపై జరుపుతున్న అమానుష హత్యాకాండను నిలిపివేయాలని సూచించారు. రైతు సంఘం నేత యాదగిరి, ఓబీసీ జేఏసీ కన్వీనర్ సాయిని నరేందర్, బీఎస్పీ బాధ్యుడు కొమ్ముల సురేందర్, సీఎంఎస్ కళ, భారత్ బచావో వెంగళ్‌రెడ్డి, ఏఐసీటీయూ సారంగపాణి, భాస్కర్, డీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు యాదగిరి, కుమారస్వామి, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఉపవాసాలతో అనేక ప్రయోజనాలు

వరంగల్: రంజాన్ మాసంలో ఉపవాసాలు చేయడం వల్ల భక్తితో పాటు వ్యక్తిగతంగా అనేక ప్రయోజనాలు చేకూరుతాయని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా అన్నారు. వరంగల్ ఎల్‌బీనగర్ అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం 21వ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ ఫుర్కాన్ ఏర్పాటు చేసిన దావత్ ఏ ఇఫ్తార్ కార్యక్రమం టీపీసీసీ కార్యదర్శి మహ్మద్ అయూబ్ నేతృత్వంలో జరిగింది. ఇఫ్తార్ విందులో ఉర్సు దర్గా పీఠాధిపతి ఖాలీద్‌సయీద్, మౌలానా ఫక్రుద్దీన్, అరుల్ రషీద్, డాక్టర్ కూరపాటి రమేష్, డాక్టర్ జన్ను పరంజ్యోతి, కుర్షిద్‌సేట్, ఫసియొద్దీన్ కాస్మీ పాల్గొన్నారు.

కాజీపేటలో దావత్ - ఏ - ఇఫ్తార్

కాజీపేట: కాజీపేట మండల కేంద్రంలోని జమా మసీదు ఆవరణలో దావత్ - ఏ - ఇఫ్తార్ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం జరిగింది. టీపీసీసీ మాజీ కార్యదర్శి సయ్యద్ రజాలీ ఆధ్వర్యంలో జరిగిన విందులో కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, క్రాంతి భరత్, ఎండీ.అస్గర్ పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ పార్టీ ఏర్పాటు చేశారు. ముందుగా రౌషన్ షహీద్ దర్గా అధ్యక్షుడు సయ్యద్ ఆరీపొద్దీన్, సామాజిక కార్యకర్త ఎండి.ఫసీతో కలిసి ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై మున్నీరుల్లా పాల్గొన్నారు.

బిర్యానీ హోటల్‌లో అగ్ని ప్రమాదం

మామునూరు: వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై బొల్లికుంట క్రాస్ రోడ్డు సమీపంలో ఐరన్ భారీ కంటైనర్‌లో ఏర్పాటు చేసిన జేపీ దావత్ బిర్యానీ హోటల్‌లో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈఘటనలో ఏసీతో పాటు వంట సామగ్రి, నిత్యావసర సరుకులు దగ్ధమయ్యాయి. స్థానికులు, ఫైర్ అధికారులు వెంటనే స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రూ.1.60లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉంటుందని ఫైర్ అధికారులు, బాధితుడు తెలిపారు. హనుమకొండ ఫైర్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లికుంటకు చెందిన విజయ్ ప్రతాప్‌రెడ్డికి ఐరన్ కంటైనర్లతో జేపీ దావత్ పేరుతో దాబా (బిర్యానీ హోటల్)ను ఏర్పాటు చేశారు. ఇటీవల ప్రతాప్‌రెడ్డి వరంగల్‌కు చెందిన రామగిరి కుందన్, శివప్రసాద్‌లకు జేపీ దావత్ దాబా హోటల్ ఏడాదిపాటు లీజుకు ఇచ్చాడు. ఈక్రమంలో ఎండ వేడిమి ఎక్కువగా ఉండటంతో శుక్రవారం మధ్యాహ్నం కంటైనర్‌లో ఏర్పాటు చేసిన వంట గదిలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడ్డాయి. హనుమకొండ ఫైర్ ఇంజన్ల సాయంతో సిబ్బంది మంటలను అదుపుచేశారు. సుమారు రూ.1.60లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్ అధికారి జనార్దన్, వరంగల్ ఫైర్ అధికారి రవీందర్ తెలిపారు. ఘటన స్థలానికి మండల రెవెన్యూ, ఫైర్ అధికారులు, మామునూరు పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. హోటల్ నిర్వాహకుల నుంచి ఘటనకు గల కారణాలను సేకరించారు.



వంట గది నుంచి ఎగిసిపడుతున్న మంటలు

కంపు.. కంపు



మురుగునీటిలో మామిడి కాయలు



హెడ్ పోస్టాఫీస్ సమీపంలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు



అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన మురుగునీరు

వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. ఆ నీటి పక్కనే కూరగాయలు, పండ్ల వ్యాపారులు తమ వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఆ నీటిలో నుంచే పాదచారులు ముక్కు మూసుకుని వెళ్తున్న దుస్థితి. అపరిశుభ్ర పరిసరాల కారణంగా పండ్లు, కూరగాయలను ఎవరూ కొనడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్